సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం ၊ 23 ၊ మే ၊ 2025

నేడు డీఎంహెచ్‌వోతో ఫోన్‌ఇన్



సిరిసిల్లటౌన్: జిల్లాలో డెంగీ, వైరల్, టైఫాయిడ్, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో టెస్టుల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారు. ఇలా సీజనల్ జ్వరాలు, వ్యాధులపై ప్రజల్లో ఎన్నో అపోహలు, సందేహాల నివృత్తికి జిల్లా వైద్యాధికారి రజితతో 'సాక్షి' శుక్రవారం ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది. జిల్లా ప్రజలు ఫోన్ చేసి తమ సందేహాల నివృత్తి చేసుకొని, సలహాలు, సూచనలు పొందవచ్చు.

తేదీ : 23-05-2025 సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలు

ఫోన్ నంబర్ : 96036 07550

క్రిప్టో కరెన్సీ దందా !

- సిరిసిల్లకు చెందిన అతను ఓ సామాన్య వస్త్రోత్పత్తిదారుడు. ఐదు జోడీల సాంచాలపై వస్త్రోత్పత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నెల రోజుల క్రితం స్థానిక గోపాల్‌నగర్‌లోని ఎల్‌ఐసీ ఆఫీస్ పక్క భవనంలో ఉన్న 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ అనే సంస్థలో రూ.2.25లక్షలు పెట్టుబడి పెట్టాడు. రోజుకు రూ.900 నుంచి రూ.1000 సదరు వ్యక్తికి వస్తున్నాయి. నెల రోజుల్లో రూ.27వేల నుంచి రూ.30వేల వరకు వాపస్ వచ్చాయి. అంటే ఏడాదిలోపే పెట్టుబడి మొత్తం తిరిగి వస్తుంది.

- రూ.2.25 లక్షలు డిపాజిట్ చేస్తే థాయిలాండ్ ట్రిప్ ఫ్రీ
- అదనంగా రోజుకు రూ.900 నుంచి రూ.1000 చెల్లింపు
- అత్యాశకు పోయి బుక్కవుతున్న సామాన్యులు
- ఇప్పటికే 200 మంది వద్ద రూ.4.50 కోట్లు వసూలు
- సిరిసిల్ల, వేములవాడ కేంద్రాలుగా అక్రమ దందా



సిరిసిల్ల పాత బస్టాండులో బోర్డు తిప్పేసిన బీఫోర్ హోటల్ నిర్వాహకుడు(ఫైల్)

- వేములవాడలో అతనో బట్టలషాపు యజమాని. చిన్న చిన్నగా వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ సంస్థ గురించి తెలియగానే రూ.2.25 లక్షలు డిపాజిట్ చేశాడు. అంతే.. సదరు బట్టల షాపు యజమానికి రోజుకు రూ.900 నుంచి రూ.1000 ఇస్తూనే అదనంగా థాయిలాండ్ ట్రిప్ ఆఫర్ ఇచ్చాడు. దీంతో ఆ బట్టల వ్యాపారి ఫ్రెండ్స్.. బంధువులు సైతం ఈ దందాను నమ్మారు. ఓ పది మంది వరకు తలో రూ.2.25 లక్షల చొప్పున డిపాజిట్ చేశారు.

> సిరిసిల్ల పట్టణానికి చెందిన రాజకీయ నాయకులు, వస్త్రవ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆసాములు ఇలా ఓ 90 మంది మూడు రోజుల క్రితం థాయిలాండ్‌కు వెళ్లారు. వీరంతా విహారయాత్రకు విదేశాలకు వెళ్లే వాళ్లేం కాదు. 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ సంస్థలో ఇలా రూ.2.25 లక్షల చొప్పున పెట్టుబడిగా పెట్టడంతో సదరు సంస్థ నుంచి ఆఫర్‌లో థాయిలాండ్ ట్రిప్‌నకు వెళ్లారు. సిరిసిల్లకు చెందిన 90 మంది ఒకేసారి థాయిలాండ్‌కు వెళ్లి.. వాట్సాప్‌లో స్టేటస్ పెడుతూ.. ఫేస్‌బుక్‌లో ఫొటోలు షేర్ చేస్తుండడంతో 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ సంస్థ డిపాజిట్ల పర్వం వెలుగులోకి వచ్చింది.

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ కొడుకు 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ దందాను సాగిస్తున్నారు. అతని తండ్రి పేరుప్రఖ్యాతులు ఉపయోగించుకుంటూ ఈ దందా షురూ చేశారు. స్థానిక గోపాల్‌నగర్‌లోని ఎల్‌ఐసీ ఆఫీస్ పక్కనే ఎలాంటి బోర్డు లేకుండానే ఆఫీస్ తెరిచి డిపాజిట్లు సేకరిస్తున్నారు. ఒకరికి వడ్డీ డబ్బులు ఎక్కువ రావడంతో వాళ్లు మరొకరికి చెబుతూ.. ప్రమోట్ చేస్తూ.. డిపాజిట్లు చేయిస్తున్నారు. ఇలా గోప్యంగా జరుగుతున్న ఈ తంతుపై ఇటీవల సిరిసిల్ల పోలీసులు ఆరా తీసినట్లు సమాచారం. చట్టబద్ధంగా లేని ఈ దందాపై బాధితుల నుంచి ఫిర్యాదులు రాకపోవడంతో పోలీసులు కూడా వదిలేసినట్లు సమాచారం. ఇప్పుడు థాయిలాండ్ ట్రిప్పులతో మరోసారి 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

'బీఫోర్ బిల్లెట్' మోసం.. కళ్లు తెరవని వైనం

నెహ్రూనగర్‌కు చెందిన యువకుడు వడ్డెపల్లి లక్ష్మీకాంత్ హైదరాబాద్ కేంద్రంగా హోటళ్లు, రెస్టారెంట్ల బిజినెస్ చేశారు. హైదరాబాద్, గజ్వేల్, కొంపల్లి, సుచిత్ర ప్రాంతాల్లో రెస్టారెంట్లు ప్రారంభించాడు. సిరిసిల్ల పాతబస్టాండు సమీపంలోనూ ఆరు నెలల కిందట 'బీఫోర్ బిల్లెట్' రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. సిరిసిల్లలో పలువురి వద్ద రూ.లక్ష తీసుకుని నెలకు రూ.5వేల చొప్పున వడ్డీ ఇస్తూ నమ్మకంగా మెదిలారు. ఈక్రమంలోనే చాలా మంది భారీగా డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. హోటళ్లు, బంకెట్ హాల్స్, రెస్టారెంట్ బిజినెస్‌లో ఎప్పుడూ బిజీగా ఉండే లక్ష్మీకాంత్ ఇటీవల ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఢిల్లీ వెళ్లిన లక్ష్మీకాంత్ ఆచూకీ తెలియకపోవడంతో అతని భార్య అర్పిత ఆల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మీకాంత్ ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడంతో సిరిసిల్లలో అతన్ని నమ్మి రూ.లక్షల్లో అప్పులు ఇచ్చిన వారు నెహ్రూనగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి ఆరా తీశారు. సిరిసిల్ల పోలీసులను ఆశ్రయించారు. లక్ష్మీకాంత్ తండ్రి సైతం పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరారు. సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్ మినీస్టేడియంలో భారీ ఎత్తున సినీ గాయకులతో ఈవెంట్ షో నిర్వహించిన లక్ష్మీకాంత్, ఈ షో నిర్వహణతో సిరిసిల్ల పట్టణంలో ఆయన పలుకుబడి భారీగా పెరిగింది. ఆ షో నిర్వహణ ప్రముఖులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. సడెన్‌గా లక్ష్మీకాంత్ ఇలా అదృశ్యం కావడం సిరిసిల్లలో చర్చనీయాంశం కాగా.. ఆయనను నమ్మి అప్పులు ఇచ్చిన వారు ఆందోళనకు గురయ్యారు. ఏదీ ఏమైనా సిరిసిల్లలో అనేక మంది వద్ద అప్పులు తీసుకున్న వ్యక్తి అదృశ్యం కావడంతో కార్మిక క్షేత్రంలో కలకలం రేగింది. ఆ తరువాత ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు సైతం రూ.కోట్లలో అప్పులు ఎగవేసేందుకు ఐపీ పెట్టి నోటీసులు పంపించారు. వేములవాడలోనూ భారీ ఎత్తున అప్పులు చేసి ఐపీలు పెట్టి వెళ్లిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి మోసాలు జిల్లాలో ఈ మధ్యలోనే జరిగినా.. సామాన్యులు అధిక వడ్డీ ఆశలతో.. విదేశీ ట్రిప్పుల వలలో పడడం గమనార్హం.

అప్రమత్తంగా లేకుంటే.. అసలుకే మోసం

సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు ఇప్పుడు నిజంగానే ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు లేక.. ఏ వ్యాపారం కూడా ఆశాజనకంగా లేవు. పోటాపోటీ వ్యాపారాలతో పెద్దగా లాభాలు లేక నెట్టుకొస్తున్నారు. ఇలాంటి దశలో 'క్రిప్టో కరెన్సీ' కాయిన్ సంస్థ డిపాజిట్లు అసలుకే మోసం తెచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే 200 మందికి పైగా ఇలా రూ.2.25లక్షల చొప్పున రూ.4.50 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించినట్లు సమాచారం. నిండా మునుగకముందే.. అప్రమత్తంగా ఉంటే.. కొంతైనా.. నష్టాన్ని తగ్గించవచ్చు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు ఈ అక్రమ డిపాజిట్ల సేకరణ దందాపై దృష్టిసారించి చట్టవిరుద్ధంగా సాగుతున్న వసూళ్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



వేములవాడ కాషాయమయం

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామిని గురువారం 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య



వేములవాడరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో మహిళలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మత్స్య సంపద పథకం ఎన్‌ఎఫ్‌డీపీలో రిజిస్ట్రేషన్ చేసి, ఆ పత్రాలను జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జిల్లా మత్స్య శాఖ చైర్మన్ చొప్పరి రామచంద్రం, వైస్‌చైర్మన్ అంబటి శేఖర్, ఉమెన్స్ సొసైటీ అధ్యక్షురాలు పెండ్యాల దీపిక, ఉపాధ్యక్షురాలు వైశాలి, మాజీ సర్పంచ్ పెండ్యాల తిరుపతి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పెండ్యాల శంకర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మావోయిస్టుల హత్యాకాండ శోచనీయం

సిరిసిల్లటౌన్: ఏడాదిగా మధ్యభారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై హత్యాకాండను కొనసాగించడం శోచనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో గురువారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. శాంతిచర్చలకు మావోయిస్టు పార్టీ, ఆపరేషన్ కగార్‌ను ఆపివేయాలని ప్రజాస్వామిక వాదులు కోరినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశపౌరులను మావోయిస్టుల పేరుతో హత్య చేస్తూ పోతోందన్నారు. అటవి సంపదను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు, మిగతా మావోయిస్టు పార్టీ సభ్యులకు జోహార్లు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సోమ నాగరాజు, కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లు దోచుకుతిన్నారు

- కాంగ్రెస్ పార్లమెంట్ కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి



సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ నాయకుల దోపిడీని ప్రజలు మరువబోరని, పదేళ్లు దోచుకుతిన్నారని కాంగ్రెస్ పార్లమెంట్ కోకన్వీనర్ కనిమేని చక్రధర్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలపై కేసీఆర్, హరీశ్‌రావులకు కమిషన్ నోటీసులు పంపితే ఆ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు. ప్రధాని మోదీ కూడా కాళేశ్వరం ప్రాజెక్టును కల్వకుంట్ల కుటుంబం ఏటీఎంలా మార్చుకుందన్నారని.. దీనికి ఏం సమాధానం ఇస్తారని అడిగారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి 17 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కనిమేని శ్రీనివాస్‌రెడ్డి, జంగం అంజిరెడ్డి, సారుగు రాకేశ్, అన్నల్‌దాస్ భాను, ఎడ్ల తిరుపతి, పొన్నాల లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



రుద్రంగి(వేములవాడ): జిల్లా సరిహద్దుల్లోని పోలీస్ చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి సూచించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి రుద్రంగిలోని జిల్లా సరిహద్దు మానాల క్రాస్‌రోడ్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును గురువారం తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు.

కంచర్లలో వైద్యశిబిరం



వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని కంచర్లలో కొనసాగుతున్న వైద్యశిబిరంను డీఎంహెచ్‌వో రజిత గురువారం తనిఖీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో అనుమానిత జ్వరపీడితులు 72 మందికి పరీక్షలు చేసి, 51 మంది రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారి సారియా అంజుమ్, సూపర్‌వైజర్ లింగం, మోహన్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేయాలి



ముస్తాబాద్/బోయినపల్లి: ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణతో విద్యాభివృద్ధి జరుగుతుందని ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఉపాధ్యాయుడిని పాఠశాల పునర్ ప్రారంభం ముందు నుంచే సమాయత్తం చేసే పనిని ప్రారంభించిందన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాకలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శ్రవణ్‌కుమార్ కోరారు.

డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గీతే



నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన నార్కోటిక్స్ సమన్వయ సమావేశంలో ఎస్పీ మహేశ్ బీ గీతేతో కలిసి మాట్లాడారు. విద్యాసంస్థల సమీపంలో పాన్‌షాప్‌లపై నిఘా పెట్టాలని, బహిరంగ మద్యపానంపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి సాగును నివారించాలన్నారు. బార్లు సమయపాలన పాటించేలా చూడాలని, థియేటర్లను ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు. కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రవీణ్, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నాజర్ అహ్మద్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఫుడ్‌సేఫ్టీ అధికారి అనూష పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి త్వరలో ఎన్నికలు నిర్వహించాలని సొసైటీ చైర్మన్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. సొసైటీ సేవలు, సభ్యత్వాల నమోదు, ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. సొసైటీ కార్యవర్గం గడువు ఈనెల 8తో ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సూచించారు. వేములవాడలో ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించామని, నిర్మాణానికి నిధులను దాతల నుంచి సేకరించాలని సూచించారు. రెడ్‌క్రాస్ సభ్యులు ప్రయాకర్‌రావు వేణుకుమార్, తాటిపాముల శివప్రసాద్, బుడిమె శివప్రసాద్, సంగీతం శ్రీనివాస్, యెల్లె లక్ష్మీనారాయణ, దేవులపల్లి రాజమల్లు, నాగశంకర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షల నిర్వహణపై ఎస్పీ మహేశ్ బీ గీతేతో కలిసి సమీక్షించారు. ఈనెల 25న జరిగే పరీక్షకు 65 మంది హాజరవుతారని, గీతానగర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జవాబు పత్రాలను సీజ్ చేశాక భద్రత సిబ్బంది సమక్షంలో హైదరాబాద్ జేఎన్టీయూకు పంపించాలని ఆదేశించారు. కలెక్టరేట్ పాలనాధికారి రాంరెడ్డి, ఆడిట్ అధికారి శ్రీనివాస్, పాఠశాల హెడ్‌మాస్టర్ శారద, సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి

సిరిసిల్ల: భాగ్యరెడ్డివర్మ జయంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జ్యోతి ప్రజ్వలన చేశారు. రాజామనోహర్‌రావు, లక్ష్మీరాజం, అఫ్జల్‌బేగం ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఆలయ విస్తరణ



ఇళ్ల మంజూరుపత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలు పంపిణీ

వేములవాడ: రాజన్న ఆలయాన్ని ప్రణాళికాబద్ధంగా విస్తరిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన 484 మంది లబ్ధిదారులకు గురువారం మంజూరుపత్రాలను మండల పరిషత్ ఆవరణలో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో కలిసి పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే నాలుగేళ్లలో ఏటా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. గత పాలకులు రాజన్న ఆలయానికి ఏటా రూ.100 కోట్లు విడుదల చేస్తామని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం ముగిసిన తర్వాత మూలవాగుపై మూడో బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామన్నారు. గుడి చెరువు, మూలవాగులోకి మురుగునీరు చేరకుండా రూ.9 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. ఆలయం మూసివేస్తామన్న అపోహలు నమ్మవద్దని కోరారు. నెల రోజుల్లోగా ఇందిరమ్మ ఇళ్ల పనులు మొదలుపెట్టాలని తెలిపారు.

ఉచితంగా ఇసుక అందిస్తాం : కలెక్టర్

భూమిలేని నిరుపేదలకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేసి అందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందజేస్తామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. పెట్టుబడి లేని పేదలకు రూ.లక్ష మహిళా సంఘాల ద్వారా అందిస్తామన్నారు. హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఎంసీ చైర్మన్ రాజు, వైస్‌చైర్మన్ రాకేశ్, సెస్ డైరెక్టర్ నామాల ఉమ పాల్గొన్నారు.

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షం
- ఎల్లారెడ్డిపేటలో విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి
- బోయినపల్లిలో అదుపుతప్పిన కారు

గెరువివ్వని వాన



సిరిసిల్లలో రోడ్డుపై వరదనీరు



గంజివాగు కల్వర్టు వద్ద అదుపుతప్పిన కారు



కరెంట్‌షాక్‌తో చనిపోయిన మేక



ఇల్లంతకుంట బస్టాండ్‌లోకి చేరిన వర్షపు నీరు

సిరిసిల్ల: జిల్లాలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోహిణీ కార్తెకు మూడు రోజుల ముందే జిల్లా అంతట ముసురు వర్షం పడింది. సిరిసిల్లలోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. వేములవాడలో 35 మి.మీ వర్షం కురువగా, బోయినపల్లిలో 33.3, వేములవాడ రూరల్‌లో 28.8, సిరిసిల్లలో 27.3, వీర్నపల్లిలో 26.8, ఇల్లంతకుంటలో 26, తంగళ్లపల్లిలో 26, గంభీరావుపేటలో 24, ముస్తాబాద్‌లో 22, కోనరావుపేటలో 21.5, చందుర్తిలో 15, రుద్రంగిలో 13, ఎల్లారెడ్డిపేటలో 9.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు, మేకలు మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రానికి చెందిన గెంటే రాములు రెండు గొర్రెలు కరెంట్ షాక్‌తో మృతి చెందాయి. వెంకటాపూర్‌లో పాండవుల నరేశ్‌కు చెందిన ఒక మేక విద్యుత్‌షాక్‌తో చనిపోయింది. ఇద్దరు రైతులకు రూ.40వేల వరకు నష్టం కలిగింది. మేకలను కాపాడబోయిన గంట పర్శరాములు కూడా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోంచి గొర్రెలమంద వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటన స్థలాన్ని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పరిశీలించారు. దుమాలలో రెండు ఇళ్ల రేకులు గాలిదుమారానికి లేచిపోయాయి.

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని గర్జనపల్లి క్రీడా ప్రాంగణంలో కొద్ది రోజులుగా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం కొనసాగుతోంది. కేంద్రం వద్ద లైట్ల కోసం వేసిన విద్యుత్ వైరు తేలి ఉండడంతో అటుగా వెళ్లిన మేకలకు తగిలి అబ్బాస్‌కు చెందిన ఓ మేక చనిపోయింది. కేంద్రం ముగిసినా వైర్లు తొలగించకపోవడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

అదుపు తప్పిన కారు.. తప్పిన ప్రమాదం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా వేసిన తాత్కాలిక రోడ్డుపై ఓ కారు అదుపుతప్పింది. వర్షంతో రోడ్డు బురదమయం కావడంతో కారు అదుపుతప్పింది. ఎవరికీ ఏమి కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కారు దిగబడడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హైలెవల్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తయ్యేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ అక్కెనపల్లి జ్యోతి కోరారు.

రోడ్లు జలమయం

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు ముస్కానిపేట, గాలిపల్లి, ఎల్లీపురం, అనంతారం, రేపాక, పెద్దలింగాపూర్ గ్రామాల్లో వర్షం కురిసింది. మండల కేంద్రంలోని కూరగాయల అంగడిలోని వరదనీరు నిలిచింది.

పుస్తకాలొచ్చాయ్..




సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాలయాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. 90 శాతానికి పైగా పాఠ్యపుస్తకాలు జిల్లాలోని గోదాంకు చేరినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల కేంద్రాలతోపాటు స్కూల్ పాయింట్లకు పంపించేలా మండల విద్యాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రం నుంచి పుస్తకాలను తరలించేందుకు నిధులపై స్పష్టత రాకపోవడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 38,087 మంది విద్యార్థులకు 2,70,587 పుస్తకాలు అవసరం కాగా 2,32,767 వచ్చాయి. ఇంకా 37,820 పుస్తకాలు రావాల్సి ఉంది.


ఉప్పొంగిన భక్తజనం



ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కోనేరులో స్నానాలు చేస్తున్న స్వాములు

మల్యాల: హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా కొండగట్టు అంజన్న సన్నిధి భక్తజనంతో ఉప్పొంగింది. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చారు. కోనేరులో ఎప్పటికప్పుడు నీరు తొలగించి, నింపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించారు. దీక్షాపరులు మాలవిరమణ చేసి అంజన్నను దర్శించుకున్నారు. వర్షానికి షామియానాలు కూలిపోయాయి.

పంచామృతాలతో అభిషేకం

స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పుష్పాలంకరణ చేసి, పట్టువస్త్రాలతో అలంకరించారు. స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు జితేంద్రస్వామి, రామకృష్ణ, రఘు, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవస్వామి, ఈవో శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి


ఎర్ర శోభ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం నీలోజిపల్లికి చెందిన వివాహిత ఎర్ర శోభ (48) విద్యుత్‌షాక్‌తో గురువారం మృతిచెందింది. ఏఎస్సై మోతీరామ్ తెలిపిన వివరాలు. శోభ స్నానం చేయడానికి ఇంటి దగ్గర ఉన్న స్నానపు గదికి వెళ్లింది. ఆ గదికి ఉన్న ఇనుప డోర్ మీదుగా తాత్కాలిక విద్యుత్ వైరుతో లైట్ ఏర్పాటు చేసుకున్నారు. ఇనుపడోర్‌కు విద్యుత్ వైరు తేలి తగిలి ఉంది. దీంతో స్నానానికి వెళ్లి డోర్ వేసుకున్న శోభకు విద్యుత్ షాక్ తగిలి మృతిచెందింది. మృతురాలి భర్త ఎర్ర రాజిరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని సెస్ ఏఏఈ ప్రశాంత్ పరిశీలించారు. శోభ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. కుటుంబీకులకు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, నాగుల వంశీ తదితరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి


జగన్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్ సమీపంలో కారు, బైక్ ఎదురెదుగా ఢీకొన్న ప్రమాదంలో రాఘవాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఏనుగుల జగన్ (25) మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. జగన్ లొంకకేసారం గ్రామంలోని తమ బంధువుల ఇంటికి బైక్‌పై బుధవారం రాత్రి వెళ్తుండగా, పెద్దపల్లి వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. వెంటనే స్థానికులు జగన్‌ను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. జగన్‌కు భార్య నిఖిత, రెండున్నరేళ్లతో పాటు, మూడునెలల వయస్సుగల కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

గంజాయి పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ బైపాస్‌రోడ్‌లో ఇస్లాంపురకు చెందిన ఎండీ.నబీద్ నుంచి 69 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఎస్సై వాహనాల తనిఖీలు చేస్తుండగా నబీద్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీలు చేయగా గంజాయి లభ్యమైంది. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

మా ఊళ్లో ఏం జరుగుతోంది?

- అందుబాటులోకి మేరీ పంచాయతీ యాప్
- నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యం
- ఆదాయ, వ్యయాలను తెలుసుకునే అవకాశం



ప్రభుత్వం రూపొందించిన 'మేరీ పంచాయతీ యాప్'లో గ్రామ పంచాయతీల సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. నిధుల వినియోగంలో లోపాలు ఉన్నా, అక్రమాలు జరిగినా యాప్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ఈ ఆధారాలతో అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.
– వీరబుచ్చయ్య, డీపీవో, పెద్దపల్లి


పన్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

రామగిరి(మంథని): గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామస్తులు తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం మేరీ పంచాయతీ(నా పంచాయతీ) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను పాలకవర్గాలు ఎలా ఖర్చు చేస్తాయనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు. యాప్‌ను 2019లో రూపొందించినా సాంకేతిక కారణాలతో కొంత సమాచారం అందించలేకపోయింది. ప్రస్తుతం సమగ్ర సమాచారంతో యాప్ అందుబాటులోకి వచ్చింది.

పారదర్శక పాలన..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని, తద్వార గ్రామాల్లో పారదర్శకపాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటంతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేపడుతున్నారో గ్రామస్తులు తెలుసుకోవచ్చు. వివరాల నమోదు సమయంలోనే జీపీఆర్‌ఎస్ ద్వారా గుర్తించే ఆవకాశం ఉండటంతో అక్కడి పనులకు కేటాయించిన నిధులను ఇతరచోట్ల వినియోగించేందుకు వీలు ఉండదు. పాలకవర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రశ్నించడానికి వీలు కలుగుతుంది.

అన్ని వివరాలు నిక్షిప్తం

గ్రామ పంచాయతీల నిధుల వివరాలు మాత్రమే కాకుండా సర్పంచ్(ప్రస్తుతం లేరు), కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తుల వివరాలన్నీ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మంజూరు చేసే నిధుల వివరాలు, దేనికి ఎంతఖర్చు చేశారు, పనులు ఏదశలో ఉన్నాయన్న వివరాలు ఇందులో నమోదై ఉంటాయి. నిధుల్లో ఎక్కువగా కార్మికులు, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు యాప్‌లో పొందుపర్చుతారు. ఇవే కాకుండా వచ్చే ఏడాది అంచనా వ్యయాల నమోదుతో పాటుగా, గ్రామ సభల వివరాలు సైతం యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

కొరవడిన అవగాహన

మేరీ పంచాయతీ యాప్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో అధికారులు వెనుకబడ్డారు. చాలా వరకు గ్రామాల్లో చదువుకున్న యువతకు తప్ప మరొకరికి ఈ యాప్ ఉన్నట్లు కూడా తెలియదంటున్నారు. యాప్‌పై అవగాహన లేక చాలామంది తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు.

ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్..

స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ యాప్‌లో మేరీ పంచాయతీ పేరిట సెర్చ్ చేయగానే వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక లాగిన్ అవ్వాలి. ఆ వెంటనే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే ఆయా పంచాయతీల సమాచారం కనిపిస్తుంది. గ్రామం పేరు, లేదంటే పిన్‌కోడ్‌తో గ్రామ పంచాయతీ పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంటుంది. చేసిన పనుల ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తారు. పల్లెపాలనలో పారదర్శకతకు ఈ యాప్ ఎంతోగానో ఉపయోగపడుతుంది.

అవగాహన కల్పించాలి



పంచాయతీల పద్దుల వివరాలు తెలుసుకునేందుకు ఓ యాప్ ఉందనే విషయం చాలామందికి తెలియదు. దీంతో నిధుల వినియోగం విషయంలో అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజలే నేరుగా నిధుల వివరాలను తెలుసుకునేలా యాప్‌పై అధికారులు అవగాహన కల్పించాలి.
– బొంకూరి పోశం, కల్వచర్ల, రామగిరి మండలం

అభివృద్ధికి నిదర్శనం కరీంనగర్ రైల్వేస్టేషన్


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌రూరల్: ఎన్‌డీఏ ప్రభుత్వ హయంలో రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందాయనడానికి కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణే నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బికనూర్ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరీంనగర్ రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యక్షంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను సైతం అమృత్ భారత్ పథకంలో ఆధునీకరిస్తామని తెలిపారు. జూన్ నెలాఖరులోగా ఉప్పల్ ఆర్వోబీ పూర్తి చేస్తామని, కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణానికి రూ.1480 కోట్లు అవసరమని డీపీఆర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. తిరుపతి రైలును వారంలో నాలుగుసార్లు నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు కృషి చేశానని, ప్రస్తుతం తిరుపతికి వారంలో రెండు పర్యాయాలు నడుస్తున్న రైలును ప్రతిరోజూ నడిపించేలా చూడాలన్నారు. కరీంనగర్– ముంబయి, షిర్డీకి రైలు నడిపించాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో పర్యటించి లిఫ్టులు, ఎస్కలేటర్లు, బుకింగ్ కౌంటర్లను మంత్రులు పరిశీలించారు. ఎమ్మెల్సీలు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, సీపీ గౌస్ ఆలం, రైల్వే రీజినల్ మేనేజర్ గోపాలకృష్ణన్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మేయర్ వై.సునీల్‌రావు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లలో విఫలం

కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో ప్రారంభోత్సవ సభ నిర్వహణలో రైల్వేఅధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రెస్ గ్యాలరీ కుర్చీల్లో రాజకీయ నాయకులతో పాటు ఇతరులు కూర్చోవడంతో మీడియా ప్రతినిధులు నిలుచునే పరిస్థితి ఏర్పడింది. స్నాక్స్, తాగేందుకు మంచినీళ్లు ఇవ్వకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. సభకు తీగలగుట్టపల్లి నుంచి పెద్దసంఖ్యలో మహిళలను స్థానిక బీజేపీ నాయకులు తీసుకురాగా.. రైల్వేస్టేషన్‌లోకి పోలీసులు, రైల్వే సిబ్బంది అనుమతించకపోవడం వివాదాస్పదంగా మారింది. దక్షిణ మధ్య రైల్వే అధికారులే సభ బాధ్యతలు చూసుకున్నారని, తమకు సంబంధం లేదని స్థానిక రైల్వే అధికారులు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ లేఖలకే పరిమితం

బీఆర్‌ఎస్ నాయకులు గతంలో ప్రతీ విషయానికి లేఖలు రాసి చేతులు దులుపుకున్నారే తప్పా ఎలాంటి అభివృద్ధి చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్ల అభివృద్ధి తమవల్లే జరుగుతోందని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మాటలు కాదు.. బుల్లెట్ దిగిందా లేదా అనేది చూడాలని కోరారు. ఎన్‌డీఏ ప్రభుత్వ హయంలో రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందాయని చెప్పడానికి కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణే నిదర్శనమన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంపై పిడుగు


గర్భగుడిలో ఏర్పడిన రంధ్రం



- ధ్వంసమైన ఆలయ శిఖరాలు

ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో బుధవారం అర్ధ రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఆలయ శిఖరం పగిలిపోయింది. పిడుగుధాటికి గర్భగుడిలోకి రంధ్రం ఏర్పడింది. ఆలయానికి సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

వర్షానికి కూలిన ఆలయం పైకప్పు


పై కప్పు కూలిన ఆలయం

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రేపాకలోని శ్రీనృసింహస్వామి ఆలయం పైకప్పు గురువారం కూలింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అతి పురాతన ఆలయం గోడలు నానిపోయి పైకప్పు గర్భగుడిలో కూలింది. దాదాపు 800 ఏళ్ల క్రితం నాటి ఆలయమని గ్రామ కాంగ్రెస్ నాయకుడు మల్లేశం తెలిపారు.

నేటి నుంచి పలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

రామగుండం: మహబూబాబాద్ సమీపంలో చేపట్టే ట్రాక్ పునరుద్ధరణ, తదితర పనుల నేపథ్యంలో న్యూఢిల్లీ నుంచి రామగుండం మీదుగా చెన్నై వైపు వివిధ రూట్లలో నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 23 నుంచి 29 వరకు రద్దు చేస్తున్నట్లు గురువారం రాత్రి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నం.17033/17034 భద్రాచలం రోడ్- సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును 23 నుంచి 29 వరకు రద్దు చేశారు. నం.20819 పూరి–ఓఖా ఎక్స్‌ప్రెస్ 25న, నం.20820 ఓఖా–పూరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 28న, నం.16093 చెన్నై సెంట్రల్–లక్నో రైలు 27న రద్దు చేశారు. నం.22647 కోర్బా–తిరువనంతపురం రైలు 28న, నం.22648 తిరువనంతపురం–కోర్బా రైలు 26న, నం.12511 గోరఖ్‌పూర్- కొచ్చువెళ్లి రైలు 22,23,25న, నం.12512 కొచ్చువెళ్లి–గోరఖ్‌పూర్ 25,27,28న, నం.20805 విశాఖ–న్యూఢిల్లీ రైలు 27,28న, నం.20806 న్యూఢిల్లీ- విశాఖపట్టణం రైలు 27,28న, నం.20803 విశాఖ–దుర్గ్ రైలు 22న, నం.20804 దుర్గ్–విశాఖ రైలు 25న, నం.16031 చెన్నై సెంట్రల్- కాట్రా శ్రీవైష్ణోదేవి రైలు 25,28,29న, నం.16032 కాట్రా–చెన్నై సెంట్రల్ రైలును 27న రద్దు చేశారు.

పోలీసుల అదుపులో మావో సానుభూతిపరుడు?

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో రెండు రోజుల క్రితం ఓ మావోయిస్ట్ సానుభూతిపరుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అతని నుంచి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారని సమాచారం. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఓ వ్యక్తి బండరాళ్లకు డ్రిల్లింగ్ వేసి జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చుతూ ఉపాధి పొందుతున్నాడు. ఈ తరుణంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొంతమంది మావోయిస్టులతో ఇతనికి సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం అతడి నుంచి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అనుమానితుడు కొద్దికాలంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే నివాసం ఉంటున్నట్లు వెల్లడైనట్లు సమాచారం. ఇతడికి మావోలతో ఉన్న సంబంధాలపై పోలీసు అధికారులు లోతైన విచారణ చేస్తున్నట్లు సమాచారం.

లారీ బీభత్సం

- ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టిన లారీ


ఢీ కొన్న లారీలు


లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్

కరీంనగర్‌రూరల్: రాజీవ్‌రహదారిలో గురువారం రాత్రి ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న లారీతో పాటు కారును ఢీకొట్టడంతో ఒక లారీ డ్రైవర్ మృతి చెందగా.. మరో లారీ డ్రైవర్ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇరుకుల్ల వద్ద కరీంనగర్ నుంచి పెద్దపల్లికి వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌పై నుంచి వెళ్లి ఎదురుగా వస్తున్న కారు, లారీని ఢీకొట్టింది. కారు పల్టీలు కొట్టి పక్కకు పడిపోగా.. లారీల ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రెండు లారీల క్యాబిన్ల నుంచి డ్రైవర్లను బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండగా. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ జిన్నా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులో ఉన్న ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉంది.

మ్యాన్‌హోల్‌లో పడిన వృద్ధుడు


మ్యాన్‌హోల్‌లో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


వృద్ధుడిని బయటకు తీస్తున్న సిబ్బంది

- రక్షించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని బైపాస్‌రోడ్‌లో నాయీబ్రాహ్మణ సంఘం భవనం ముందుగల మ్యాన్‌హోల్‌లో ఓ వృద్ధుడు పడిపోయాడు. పట్టణానికి చెందిన ముకుందరెడ్డి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా వరదనీరు ఎక్కువ రావడంతో మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడిని, ద్విచక్ర వాహనాన్ని గంటపాటు శ్రమించి బయటకు తీశారు. వృద్ధుడికి స్వల్ప గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించడంతో వృద్ధుడు ప్రాణాలతో బయటపడ్డాడు.


రాజన్న తిప్పాపూర్ గోశాలలో బురదలో కోడెలు

వసతికి మించి !

- గోశాలలో ఇబ్బంది పడుతున్న కోడెలు
- చిన్నపాటి చినుకులకే బురదమయం
- నిలిచిన రైతులకు పంపిణీ కార్యక్రమం
- సౌకర్యాలు లేక అవస్థలు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామికి భక్తులు కోడెమొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. చాలా మంది భక్తులు తమ అభీష్టాలు నెరవేరితే రాజన్నకు నిజకోడె సమర్పిస్తామని మొక్కుకుంటారు. ఇలా భక్తులు ద్వారా ప్రతి నిత్యం పదుల సంఖ్యలో కోడెలు రాజన్న గోశాలలకు వచ్చి చేరుతున్నాయి. వీటి సంరక్షణ కోసం గుడిచెరువు కట్ట వద్ద ఓ గోశాల, తిప్పాపూర్‌లో మరో గోశాలను ఏర్పాటు చేశారు. భక్తులు కోడెమొక్కులు చెల్లించుకునేందుకు గుడిచెరువు కట్ట గోశాల నుంచి షిఫ్టులవారీగా ఆలయానికి తీసుకెళ్తుంటారు. మిగతా కోడెలు తిప్పాపూర్‌లోని గోశాలకు తరలిస్తుంటారు.

తిప్పాపూర్‌లో అపరిమిత కోడెలు

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలో 400 నుంచి 500 కోడెలకు వసతి ఉంది. కానీ ఇక్కడ ప్రస్తుతం 900 నుంచి 1000 వరకు కోడెలు ఉన్నాయి. వసతికి మించి రెండింతలు కోడెలు ఉండడంతో సౌకర్యాల కల్పనకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గోశాలలోని పరిసరాలు బురదమయంగా మారాయి.

నిలిచిన కోడెల పంపిణీ

రాజన్న గోశాలలో కోడెల సంఖ్య పెరిగిపోవడంతో 2024, జూలై నెలలో ఆసక్తి గల రైతులకు రెండు కోడెల చొప్పున పంపిణీ చేశారు. తర్వాత మధ్యలో ఓ సారి పంపిణీ చేసిన అధికారులు అనంతరం నిలిపివేశారు. 2024, డిసెంబర్‌లో రైతులకు ఇచ్చిన కోడెలు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామంలో పక్కదారి పట్టినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. దీంతో అప్పటి నుంచి కోడెల పంపిణీ నిలిపివేశారు.

వసతులు అంతంతే..

తిప్పాపూర్‌లోని గోశాలలో సగభాగం సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. కోడెలు ఉండే షెడ్ల ముందు భాగం సీసీరోడ్డు పనులు ఇప్పుడే మొదలుకావడంతో వర్షానికి కోడెలు ఉన్న స్థలం బురదమయంగా మారింది. ఆ బురదలోనే కోడెలు ఉంటున్నాయి. దీనికితోడు నిత్యం భక్తులు సమర్పిస్తున్న నిజకోడెలు గోశాలకు వచ్చి చేరుతున్నాయి. భక్తులు సమర్పిస్తున్న నిజకోడెల్లో చిన్నకోడెలు ఉండడంతో సమస్యగా మారిందని ఆలయ అధికారులు తెలుపుతున్నారు. చిన్నకోడెలు త్వరగా అనారోగ్యానికి గురవుతున్నాయని, చిన్నకోడెలను తీసుకురావద్దని కోరుతున్నా భక్తులు వినడం లేదని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

పంపిణీకి చర్యలు తీసుకుంటాం



వేములవాడ రాజన్న గోశాలలో కోడెల సంఖ్య పెరగడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాజన్న కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
– వినోద్‌రెడ్డి, వేములవాడ రాజన్న ఆలయ ఈవో


సహస్ర దీపాలంకరణ


ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి ఊంజల్ సేవలో అర్చకులు

కొండగట్టులో సహస్ర దీపాలంకరణ

- స్వామివారికి ఊంజల్ సేవ

మల్యాల: కొండగట్టులో ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్న హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవ మూర్తికి ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామికి శావ నిర్వహించారు. ఆలయంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు

హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరు వేల లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు.